క్లుప్తంగా

కేసీఆర్, కేటీఆర్‌లే బాధ్యత వహించాలి

జూలూరుపాడు: పదో తరగతి పరీక్ష పేపర్ల లీకేజీకి బాధ్యత వహిస్తూ సీఎం కేసీఆర్, రాష్ట్ర ఐటీ మంత్రి కేటీఆర్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి బాధ్యత వహిస్తూ తక్షణమే రాజీనామా చేయాలని టీపీసీసీ సభ్యుడు మాళోత్ రాందాస్ నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం జూలూరుపాడులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగులు, విద్యార్థులతో బీఆర్ఎస్ ప్రభుత్వం చెలగాటం ఆడుతోందన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ మరవక ముందే టెన్త్ పేపర్ల లీకేజీతో లక్షలాది మంది విద్యార్థులను ఆందోళనకు గురిచేస్తోందన్నారు. పదో తరగతి బోర్డు ఎదుట యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తే తప్పును సరిదిద్దుకోవాల్సిన ప్రభుత్వం శివారెడ్డిపై అక్రమంగా కేసు పెట్టి జైలుకు పంపించిందన్నారు. వరుస లీకులతో విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్న బీఆర్ఎస్‌కు ప్రజలు తగిన విధంగా బుద్ధి చెపుతారన్నారు. బొడ్డు కృష్ణయ్య, లకావత్ లచ్చు నాయక్, బాబు, అచ్చయ్య పాల్గొన్నారు.

సీఈఆర్ క్లబ్ సభ్యులకు గిఫ్ట్‌లు పంపిణీ

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలోని వివిధ విభాగాలలో పనిచేస్తూ సీఈఆర్ క్లబ్ సభ్యులకు ఏరియా వర్క్‌షాపు ఎస్ఈ శ్రీకాంత్ ఆధ్వర్యంలో బుధవారం గిఫ్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ... సీఈఆర్ క్లబ్ సభ్యులు ప్రతినెల కొంత ఎమౌంట్‌ను రికవరీ చేసి, అట్టి డబ్బుల ద్వారా కార్మికులకు ప్రతి ఏటా కొన్ని గిఫ్టులు కొనివ్వటం ఆనవాయితీ అని, ఈ నేపథ్యంలో ఈ రోజు క్లబ్ సభ్యులకు గిఫ్టలను అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ జాక్, వర్క్‌షాపు పిట్ సెక్రటరీ సత్తార్‌పాషా, పాదిల శ్రీనివాస్, శేఖర్‌బాబు, ఎల్లయ్య, ఐమన్స్ పాల్గొన్నారు.

వేతన సవరణ అలవెన్స్‌లు అమలు చేయండి

సింగరేణి(కొత్తగూడెం): 11వ వేతన సవరణ అలవెన్స్‌లను త్వరగా పూర్తిచేయాలని లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని బీఎంఎస్ జాతీయ నాయకుడు పి.మాధవనాయక్ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. బొగ్గు పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు జేబీసీసీఐ 11వ వేజ్‌బోర్డ్ సమావేశంలో 19 శాతం ఎంజీబీ మాత్రమే అంగీకారం కుదిరిందని, మిగతా అన్ని విషయాలు ఈనెల 18న జరిగే సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. కార్మికులకు 11వ వేజ్‌బోర్డ్ సమావేశాలు నిర్వహించి త్వరితగతిన ఫలితాలు అందించాలని ప్రయత్నిస్తున్న క్రమంలో సింగరేణిలోని కొంతమంది అధికారులు కావాలనే వేజ్‌బోర్డ్ సమావేశాలను జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. ఇదిలా ఉండగా కొంతమంది సోషల్ మీడియా నిర్వహించే నాయకులు బీఎంఎస్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-1 ఇంక్‌లైన్‌లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఉత్పత్తి వెనుకంజలో ఉందని, దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్థిక సాయం

జూలూరుపాడు: జూలూరుపాడు సబ్ మార్కెట్ యార్డు హమాలీ సంఘం ఆధ్వర్యంలో అనాథ వృద్ధురాలికి ఆర్థిక సాయం చేశారు. బుధవారం స్థానిక సబ్ మార్కెట్ యార్డు వద్ద వృద్ధురాలు జారి కిందపడటంతో ఆమె కాలు విరిగింది. గమనించిన హమాలీ నరసింహారావు 108 వాహనానికి ఫోన్ చేసి ఆస్పత్రికి తరలించారు. అదేవిధంగా హమాలీ సంఘం ఆధ్వర్యంలో వృద్ధురాలికి రూ.2 వేలు ఆర్థిక సాయం చేశారు. హమాలీలు మహేష్, భాస్కర్, కొండయ్య, కిట్టయ్య తదితరులు ఉన్నారు.

ఇరవై గ్రామాలకు ఇక్కట్లు

- వినోభానగర్ లింకు రోడ్డు అధ్వానం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



జడలచింత-వినోభానగర్ మధ్య బీటీ రోడ్డు నిర్మించాలని కోరుతున్న కొత్తూరు రైతులు

జూలూరుపాడు: మండలంలోని కొత్తూరు నుంచి వినోభానగర్ గ్రామం వరకు లింకు రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి కొత్తూరు నుంచి వినోభానగర్ వరకు ఉన్న లింకు రోడ్డు నిర్మించాలని కోరుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కొత్తూరు, వినోభానగర్ గ్రామాల మధ్య సుమారు ఐదు కిలోమీటర్ల మేర ఉన్న డొంక దారిని అభివృద్ధి చేయకపోవడంతో ప్రజలు, వ్యవసాయ పొలాలకు వెళ్లే ప్రధాన మార్గం ఇదే కావడంతో రైతులు, వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ డొంకదారిలో రాళ్లు, గుంతలమయంగా ఉండటంతోపాటు ఇరువైపుల ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు, చెట్లు పెరగడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. వానాకాలంలో రోడ్డు మరింత అధ్వానంగా ఉండటంతో రైతులు, కూలీల బాధలు వర్ణనాతీతం. అదేవిధంగా పశువులు, మూగజీవాలు మేత కోసం పొలాలు వెళ్లడం కష్టంగా మారింది. ఎండ్ల బండ్లు, ద్విచక్ర వాహనాలు, ట్రాలీలు, ట్రాక్టర్లపై ఎరువు కట్టలను పొలానికి తీసుకెళ్లడం తీవ్ర ఇబ్బందిగా ఉంటుందని రైతులు వాపోతున్నారు. ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులకు, ప్రజాప్రతినిధులకు ప్రజలు గుర్తుకు వస్తారని, సమస్యలు పరిష్కరించాలనే ఆలోచన మాత్రం రాదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వినోభానగర్, కొత్తూరు, జడలచింత, చిన్నహరిజనవాడ, పెద్దహరిజనవాడ, రాజారావుపేట, పాపకొల్లు తదితర గ్రామాలకు చెందిన రైతులు, కూలీలతోపాటు, పలు గ్రామాలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం రద్దీగా ఉండే ఈ డొంకదారిని బీటీ రోడ్డుగా నిర్మించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చేస్తున్నారు. వినోభానగర్, కొత్తూరు గ్రామ పంచాయతీలు రెండూ గతంలో పాపకొల్లు గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాలే. 18 ఏళ్ల క్రితం వినోభానగర్ గ్రామ పంచాయతీ ఏర్పడగా, 2018లో కొత్తూరు గ్రామ పంచాయతీ ఏర్పడింది. ఈ రెండు గ్రామ పంచాయతీలను అనుసంధానం చేస్తూ బీటీ రోడ్డు నిర్మించాల్సి ఉండగా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తూరు - వినోభానగర్ గ్రామాల మధ్య బీటీ రోడ్డు నిర్మిస్తే 20 గ్రామాల ప్రజల రాకపోకలకు సౌకర్యంగా ఉంటుంది. ఈ బీటీ రోడ్డు మంజూరు కోసం అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు బీటీ రోడ్డు మంజూరుకు ప్రతిపాదనలు పంపించామని చెపుతున్నారే తప్ప కార్యరూపం దాల్చడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఈ లింకు రోడ్డు మంజూరయ్యేలా ఎమ్మెల్యే రాములు నాయక్ కృషి చేయాలని ఇరవై గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



అధ్వానంగా మారిన డొంక దారి

బీటీ రోడ్డు నిర్మించాలి



తాతతండ్రుల నాటి కంటే ముందు నుంచే ఉన్న డొంక దారిని అభివృద్ధి చేయకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. కొత్తూరు నుంచి వినోభానగర్ వరకు బీటీ రోడ్డు మంజూరు చేయాలి. 20 గ్రామాల ప్రజల రాకపోకలకు సౌకర్యవంతంగా ఉంటుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బీటీ రోడ్డు మంజూరు చేయాలి.

– నున్నా కృష్ణయ్య, రైతు, కొత్తూరు

ఏళ్లుగా ఇబ్బంది పడుతున్నాం



వినోభానగర్ లింక్ రోడ్ నిర్మించాలని కోరుతూ వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్, ఎంపీ నామ నాగేశ్వరరావులకు వినతిపత్రాలు అందజేశాం. ఈ రోడ్డు నిర్మిస్తే ఎన్నో ఏళ్ల నుంచి పడుతున్న ఇబ్బందులు తీరుతాయి. వినోభానగర్ గ్రామం వెళ్లి రావాలంటే 18 కిలోమీటర్లు దూరం తిరిగి రావాల్సి వస్తోంది.

– బూరం వెంకటలక్ష్మి, సర్పంచ్, కొత్తూరు

రోడ్డు మంజూరు చేయిస్తాం



కొత్తూరు– వినోభానగర్ వరకు బీటీ రోడ్డు మంజూరు కోసం కృషి చేస్తున్నాం. ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు. వినోభానగర్ లింక్ రోడ్డును అభివృద్ధి పరిస్తే పలు గ్రామాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. ఈ రోడ్డుకు అధికారులు ప్రతిపాదనలు పంపించారు.

– లావుడ్యా సోని, ఎంపీపీ, జూలూరుపాడు

పని ప్రదేశాల్లో వసతులు కల్పించండి

ఇల్లెందురూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు రోజువారీ కూలి రూ.750 చొప్పున చెల్లించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు తుపాకుల నాగేశ్వరరావు, ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి సారంగపాణి డిమాండ్ చేశారు. చల్లసముద్రం గ్రామపంచాయతీ వేములవాడ, మామిడిగుండాల గ్రామపంచాయతీ రాజ్యాతండా గ్రామాలలో ఉపాధి హామీ కూలీలతో బుధవారం వారు సమావేశమయ్యారు. మాట్లాడుతూ.. పని ప్రదేశంలో సదుపాయాలు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న కూలి చెల్లించాలని, ఫీల్డ్ అసిస్టెంట్లతోపాటు మేట్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రభుత్వ బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఉపాధి హామీ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 28న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని, కూలీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. నరాటి వెంకటేశ్వర్లు, యాకన్న, కల్తి సుభద్ర, భద్రమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

టేకులపల్లి: ఉపాధి హామీ పథకంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 28న నిర్వహించే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గౌని నాగేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. ఈమేరకు బుధవారం ఐఎఫ్‌టీయూ, ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో బద్దుతండాలో జరుగుతున్న ఉపాధి హామీ పని ప్రదేశంలో ప్రచారం నిర్వహించారు. రాయండ్ల కోటిలింగం, చీమల నాగరాజు, ఊకె రామకృష్ణ, చింత రవి, సాయి, సురేష్ పాల్గొన్నారు.

సుజాతనగర్: ఉపాధి కూలీల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందగట్ల సురేందర్, జిల్లా సహాయ కార్యదర్శి వై గోపాల్‌రావులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం వేపలగడ్డ–సుజాతనగర్ కాలువ పూడికతీత పనులు చేస్తున్న ఉపాధి కూలీలను ఏఐకేఎంఎస్ నాయకులు కలిసి, వారు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మోత్కూరి మల్లికార్జున్‌రావు, జంగిలి వెంకటేశ్వర్లు, వీరాంజనేయులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందాం..

ఇల్లెందు: బీజేపీకో హటావో– దేశ్‌కో బచావో నినాదంతో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు మిర్యాల రంగయ్య తెలిపారు. బుధవారం ఇల్లెందులోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 14 నుంచి 20 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో యాత్రలు కొనసాగుతాయని తెలిపారు. ఈ నెల 17న ఇల్లెందు నియోజకవర్గ యాత్ర సాగుతుందని విజయవంతం చేయాలని కోరారు. కె.సారయ్య, నాగయ్య, ఐలయ్య, రాజారామ్, న్యాయవాది సత్యనారాయణ, కౌన్సిలర్ రవీందర్, కృష్ణ పాల్గొన్నారు.

నేడు పెద్దమ్మతల్లి ఆలయంలో చండీహోమం

పాల్వంచరూరల్: మండల పరిధి కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో పౌర్ణమి సందర్భంగా నేడు చండీహోమం పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎస్.రజనీకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హోమంలో పాల్గొనే భక్తులు రూ.2,516 చెల్లించి గోత్రనామాలను నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9866923261 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఆలయ కమిటీ చైర్మన్‌గా నాగేశ్వరరావు



సుజాతనగర్: సింగభూపాలెం కోదండ రామస్వామి ఆలయ నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా చిమట నాగేశ్వరరావు, వైస్ చైర్మన్‌గా బూరుగు ప్రసాద్, సెక్రటరీగా పాదిల శ్రీనును ఎన్నుకున్నారు. వీరితో పాటు మరో 15 మందిని కమిటీ సభ్యులుగా తీసుకున్నారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు ఈ సందర్భంగా తెలిపారు.

మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలి

టేకులపల్లి: తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ టేకులపల్లి మండల ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జటంగి వెంకన్న పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం మండలంలోని తొమ్మిదో మైలుతండా, బేతంపూడి, ముత్యాలంపాడు గ్రామ పంచాయతీల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ, పీఆర్‌సీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సరికొండ నాగేశ్వర్‌రావు, రామిశెట్టి నరసింహారావు, గుగులోత్ రాంచంద్రు, యశోద, బిచ్చా తదితరులు పాల్గొన్నారు.

లీకేజీలో కుట్ర ఉంది..

ఇల్లెందు: రాష్ట్రంలో జరుగుతున్న పరీక్షల పేపర్ లీకేజీల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ కుట్రకోణం ఉందని ఎమ్మెల్యే హరిప్రియ ఆరోపించారు. బుధవారం ఇల్లెందులోని క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నిన్నటి టీఎస్‌పీఎస్ పేపర్, నేటి టెన్త్ పేపర్ లీకేజీలో పాత్రదారులైన రాజశేఖర్‌రెడ్డి, ప్రశాంత్‌లకు బీజేపీతో లింకులు లేవా అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రాన్ని అభాసుపాలు చేసేందుకు రాజకీయ కుట్రలకు విద్యార్థులను బలి చేయటం తగదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కోటి ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించి ఏళ్లు గడుస్తున్నా నేటికీ ఒక్క ఉద్యోగం ఇవ్వలేదని విమర్శించారు. కార్యక్రమంలో దిండిగల రాజేందర్, నాదేళ్ల శ్రీనివాస రెడ్డి, పరుచూరి వెంకటేశ్వరరావు, మనోహర్ తివారీ తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి



ఇల్లెందు: బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రాపటానికి పూలమాల వేస్తున్న ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ

దళితులు, బహుజనుల అభ్యున్నత కోసం బాబూ జగ్జీవన్‌రామ్ ఎంతో కృషి చేశారని పలువురు వక్తలు కొనియాడారు. కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లోని విద్యాలయాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో, వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ 116వ జయంతి ఘనంగా నిర్వహించారు. మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుడు బాబు జగ్జీవన్‌రామ్ 40 ఏళ్ల పాటు వివిధ మంత్రి పదవులను నిర్వహించడమే కాకుండా భారత ఉపప్రధానిగా సేవలందించారన్నారు. – సాక్షి నెట్‌వర్క్



పాల్వంచరూరల్: బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వనమా



చుంచుపల్లి: బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం



జూలూరుపాడు: డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



సింగరేణి(కొత్తగూడెం): రామవరంలో...





కొత్తగూడెంరూరల్: పోట్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో..., పాల్వంచరూరల్: గురుకుల కళాశాలలో...



కొత్తగూడెంఅర్బన్: మున్సిపల్ కార్యాలయంలో..

రాష్ట్రంలో బీజేపీకి అధికారం పగటి కలే..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారం పగటి కలేనని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. 10వ తరగతి పరీక్ష పేపర్ల లీకేజీలో ప్రధాన సూత్రధారి బండి సంజయ్ అని ఆరోపించారు. పక్కా వ్యూహంతో తెలుగు, హిందీ ప్రశ్నపత్రాలను లీక్ చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అవమానించడానికి బీజేపీ కుట్రలు చేస్తోందన్నారు. లీకేజీ నిందితులతో బీజేపీ నాయకులకు లింకులున్నాయని, ఈ విషయాన్ని పోలీసులు నిగ్గు తేల్చారని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను గద్దె దించాలని మోదీ, అమిత్‌షా, బండి సంజయ్‌లు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ నిజస్వరూపాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. రాష్ట్రంలో ఎలాగైనా రాష్ట్రపతి పాలన పెట్టాలని బీజేపీ భావిస్తోందని ధ్వజమెత్తారు. కక్షతో బీఆర్ఎస్ నాయకులపై ఈడీతో కేసులు పెట్టిస్తున్నారని, కవిత ఉదంతమే దీనికి నిదర్శనమన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో కంచర్ల చంద్రశేఖర్‌రావు, కాపు సీతాలక్ష్మి, దామోదర్, బదావత్ శాంతి, భూక్యా సోన, విజయలక్ష్మి, కె.ధర్మరాజు, రుక్మాందర్ బండారీ, దూదల బుచ్చయ్య పాల్గొన్నారు.

పేదలకు కల్యాణలక్ష్మి గొప్ప వరం



టేకులపల్లి: చుక్కాలబోడులో సీసీ రోడ్లకు ప్రారంభోత్సవం చేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

టేకులపల్లి: పేదలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు గొప్ప వరం లాంటివని ఇల్లెందు ఎమ్మెల్యే బాణోతు హరిప్రియ అన్నారు. బుధవారం తహసీల్దార్ అప్మద్‌పాషా అధ్యక్షతన తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టేకులపల్లి మండలానికి చెందిన 96 మంది ఆదివాసీ, గిరిజన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా హరిప్రియ మాట్లాడారు. ప్రభుత్వ నిధులతో పెళ్లిళ్లు జరుగుతున్న ఘనత తెలంగాణలో రాష్ట్రంలో మాత్రమే ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా రాధ, సర్పంచ్‌లు సురేందర్, ఉపేంద్ర బాబు, లక్ష్మీనారాయణ, బి.విజయ, చిన్ని, ఇందిర, ఎంపీటీసీలు చింత శాంతకుమారి, ఊకె రామకృష్ణ, బాలకృష్ణ, లక్కినేని శ్యాం, కంభంపాటి చంద్రశేఖర్, ఆర్ఐలు రత్తయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు ప్రారంభం.. ఎమ్మెల్యే బాణోతు హరిప్రియ బుధవారం టేకులపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించారు. చుక్కాలబోడు పంచాయతీలో రూ.26 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఆమె ప్రారంభించారు. సర్పంచ్ గంగ, ఉప సర్పంచ్ లక్ష్మి, డీఈ రామకృష్ణ, ఏఈ రాజు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం..

ఇల్లెందురూరల్: ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. పోలారం గ్రామపంచాయతీ బొంబాయి తండా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కనుగోరి రవి ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. పార్టీ ఆధ్వర్యంలో మంజూరైన రూ.2 లక్షల బీమా చెక్కును రవి కుటుంబానికి ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. శీలం రమేష్, రేణుక, ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని విన్నపం..

మిషన్ భగీరథ పైపులైన్ వేయకపోవడం వల్ల తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నామని, రహదారులు అధ్వానంగా ఉన్నాయని ఇందిరానగర్ గ్రామపంచాయతీ సుందరయ్యనగర్‌కు చెందిన మహిళలు ఎమ్మెల్యే హరిప్రియకు బుధవారం ఫిర్యాదు చేశారు. పలు వీధులలో సీసీ రోడ్లు వేసినప్పటికీ మా వీధిని నిర్లక్ష్యం చేయడం వల్ల వర్షాకాలంలో తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు వాపోయారు.

ప్రజా వ్యతిరేక పాలన కొనసాగుతోంది..



జోడో యాత్రలో ఎడవల్లి కృష్ణ, నాయకులు

కొత్తగూడెంరూరల్: ప్రజా సమస్యలపై పార్లమెంట్‌లో మాట్లాడిన ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీని ప్రధాని మోదీ అణచివేయాలని చూస్తున్నారని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ అన్నారు. బుధవారం కొత్తగూడెం నియోజకవర్గం పట్టణ పరిధి రైల్వే స్టేషన్ నుంచి హాత్ సే హాథ్ అభియాన్ జోడో యాత్ర ఎంజీ రోడ్డు పెద్ద బజార్, చిన్నబజార్, కొత్తగూడెం బస్టాండ్ సెంటర్ వరకు యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక పాలన చేస్తున్నాయని ఆరోపించారు. ప్రజా సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించిన రాహుల్ గాంధీపై అనర్హత వేటు సరికాదన్నారు. రాహుల్ గాంధీ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అమలు అవుతాయని చెప్పారు. కార్యక్రమంలో రాయల శాంతయ్య, బొమ్మిడి మల్లికార్జున్, నూకల రంగారావు, అంతోటి పాల్, పల్లపు వెంకటేశ్వర్లు, జలీల్, గులాం మతీన్, కొప్పుల రమేష్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొదెం వీరయ్యను విమర్శిస్తే సహించం

ఇల్లెందు: డీసీసీ అధ్యక్షుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్యను విమర్శిస్తే సహించమని కాంగ్రెస్ నాయకులు చీమల వెంకటేశ్వర్లు, పట్టణ, మండల అధ్యక్షులు దొడ్డా డానియేల్, పులి సైదులు అన్నారు. బుధవారం ఇల్లెందులోని జగదాంబా సెంటర్ కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్‌లోనే పుట్టిన వీరయ్య కాంగ్రెస్ పార్టీకి వీరవిధేయుడని తెలిపారు.

అలాంటి వీరయ్య మీద కొంతమంది కుహనా నాయకులు అవాకులు, చెవాకులు పేలితే సహించబోమన్నారు. సమావేశంలో దేవీనాయక్, ఎట్టి హరికృష్ణ, సుదర్శన్‌కోరీ, రవినాయక్, కాయం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్ అరెస్ట్ అక్రమం..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ బుధవారం కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లోని బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. టీఎస్ పీఎస్సీ ప్రశ్నపత్రాలు లీకేజీపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడంతోనే కక్ష కట్టి అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపించారు. టెన్త్ పరీక్ష పేపర్లు లీకేజీ అవుతుంటే రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో విఫలమైందన్నారు. – సాక్షి నెట్‌వర్క్



చుంచుపల్లి: కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు



టేకులపల్లిలో నిరసన తెలుపుతున్న నాయకులు



పాల్వంచరూరల్: బీజేపీ నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా పెద్దవాగుపై బ్రిడ్జి

జూలూరుపాడు మండలం గుండ్లరేవు గ్రామ సమీపంలోని పెద్దవాగుపై నిర్మించిన బ్రిడ్జి ప్రమాదకరంగా ఉంది. బ్రిడ్జిపై సైడ్‌వాల్స్ (రెయిలింగ్) ఏర్పాటు చేయకపోవడంతోపాటు, నిర్మించిన దిమ్మెలు విరిగిపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా బ్రిడ్జిపై గుంతలు ఏర్పడటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– జూలూరుపాడు



ప్రశ్నించాల్సిన అధికారి : లఖన్ నాయక్, ఆర్అండ్‌బీ ఏఈ, జూలూరుపాడు
సెల్ నంబర్ : 9866309579